క్లుప్తంగా

క్రీడల్లోనూ ప్రతిభ చూపాలి



మైలవరం: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. మైలవరం నియోజకవర్గ స్థాయిలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు చంద్రగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) గురువారం ప్రారంభించి మాట్లాడారు. క్రీడాకారులకు ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. క్రీడాకారులు ప్రతిభ చూపి నియోజకవర్గ స్థాయి నుంచి జిల్లా స్థాయి పోటీలకు ఎదగాలన్నారు. క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు సంస్థ పురోభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేయాలని చీఫ్ ఇంజినీర్ టి.నాగరాజు అన్నారు. మాల విద్యుత్ ఉద్యోగుల సంఘం డైరీ, క్యాలెండర్‌ను ఆయన చాంబర్‌లో గురువారం ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ఉద్యోగ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.శ్యాం, అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు, రీజినల్ కార్యదర్శి వై.రాయప్ప, అంబేడ్కర్, దత్తు, సభ్యులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): స్వాతంత్య్ర సమరయోధుల జీవితాలపై విద్యార్థులకు జిల్లా స్థాయి క్విజ్ పోటీలు గురువారం నిర్వహించారు. సీబీఎస్ఈ సిలబస్‌కు చెందిన 100 మంది బాలబాలికలు పోటీలో పాల్గొన్నారు. విజేతలకు ప్రధాని మోదీ రచించిన ఎగ్జామ్ వారియర్ బుక్, పార్టిసిఫికేషన్ సర్టిఫికెట్‌లను రైల్వే డివిజినల్ మెడికల్ అధికారి శ్రీనివాసులు అందజేశారు. ప్రిన్సిపాల్ పీవీఎస్ఎస్ఆర్ కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందాలి

తిరువూరు: విద్యార్థులు, యువకులు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల్లో అవగాహన పెంపొందించాలని తిరువూరు సెక్టార్-1 ఎస్ఐ సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానిక వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్రం, రవాణా శాఖలు సంయుక్తంగా నిర్వహించిన ట్రాఫిక్ వాలంటరింగ్ వారోత్సవాల ముగింపు సందర్భంగా విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. రహదారి భద్రతా నియమాలు తెలిసినా అధిక శాతం వాహన చోదకులు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నారని, వీరిలో మార్పు వస్తే ప్రమాదాలు తగ్గుతాయని ఎస్ఐ అన్నారు. వాహినీ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ, ఎన్‌వైకే వలంటీర్లు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

కాపునాడు సేవా సమితి కన్వీనర్‌గా సత్యనారాయణ

ఆగిరిపల్లి: నూజివీడు నియోజకవర్గ కాపునాడు సేవా సమితి కన్వీనర్‌గా ఈదర గ్రామానికి చెందిన రామిశెట్టి సత్యనారాయణ నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ కాపునాడు సేవా సమితి జాతీయ అధ్యక్షుడు మల్లెల శివ నాగేశ్వరరావు సత్యనారాయణకు నియమక పత్రాన్ని అందజేశారు.

రంగాపురం బాలికల గురుకుల పాఠశాల తనిఖీ

మైలవరం: రెడ్డిగూడెం మండలం రంగాపురం గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలను మండల ప్రత్యేకాధికారి, జిల్లా హార్టికల్చర్ అధికారి పి. బాలాజీ కుమార్‌తో కలిసి తహసీల్దార్ జె. సుశీలాదేవి గురువారం తనిఖీ చేశారు. సిబ్బంది, విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారి గంధం పుల్లయ్య, గ్రామ రెవెన్యూ అధికారి రాజేష్, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

విమలక్క సేవలు ఆదర్శం

వేల్పుచర్ల (ముసునూరు): పేదల పక్షాన ఎన్నో భూ పోరాటాలు చేసిన అమరజీవి విమలక్క జీవితం నేటి తరాలకు ఆదర్శమని సీపీఐ రాష్ట్ర సమితి నేత చలసాని వెంకట రామారావు అన్నారు. వేల్పుచర్ల గ్రామంలో విమలక్క వర్ధంతి కార్యక్రమాన్ని సీపీఐ నేత అబ్బూరి రంగారావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అబ్బూరి విమలాదేవి స్మారక పురస్కారాన్ని నూజివీడు నియోజకవర్గ నేత నిమ్మగడ్డ నరసింహానికి అందజేశారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిందితుల బైండోవర్

ముసునూరు: అక్రమంగా సారా విక్రయిస్తున్న పాత కేసు ముద్దాయిలు ఐదుగురిని గురువారం తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ ఎదుట బైండోవర్ చేశారు. చిల్లబోయినపల్లికి చెందిన పామర్తి జ్యోతి, అక్కిరెడ్డిగూడేనికి చెందిన చిలుకబత్తుల రవి, చింతలవల్లి శివారు గోగులంపాడుకు చెందిన పామర్తి రామారావు, చెక్కపల్లికి చెందిన తాళం నాగరాజు, సూరేపల్లికి చెందిన చల్లారి ప్రియాంకలను బైండోవర్ చేయగా తహసీల్దార్ వారిని నేరాలకు పాల్పడొద్దని తిరిగి నేరాలు చేస్తే ప్రభుత్వం నుంచి అందే సౌకర్యాలు రద్దవుతాయని హెచ్చరించారు.

అడుగడుగునా గుంతలు



ఊటవాగు వద్ద అధ్వానంగా ఉన్న రహదారి



పోతురెడ్డిపల్లి వద్ద రహదారి దుస్థితి

- అధ్వానంగా రహదారులు
- వాహనాలు దెబ్బతింటున్నాయని ప్రజల గగ్గోలు
- ప్రయాణికుల ఇబ్బందులు
- సంక్రాంతి దాటి పది రోజులైనా పూడ్చని గుంతలు

నూజివీడు: సంక్రాంతికి రహదారులపై గుంతలేవీ ఉండటానికి వీల్లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను నెల రోజుల కిందట ఆదేశించారు. సంక్రాంతి వెళ్లి పది రోజులు గడిచింది. అయినప్పటికీ నూజివీడు నుంచి ముసునూరు వెళ్లే రహదారిలో అడుగడుగునా గుంతలు దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలు గడిచినా నూజివీడు నుంచి ముసునూరు వెళ్లే రహదారి రూపురేఖలేవీ మారలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుంచి గత ప్రభుత్వం రహదారులను పట్టించుకోలేదంటూ టీడీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు విమర్శలు గుప్పిస్తున్నారు. ముఖ్యమంత్రి ప్రకటించాక కూడా ఇంతవరకు ఒక్క గుంతనూ పూడ్చలేదు. నూజివీడు నుంచి ముసునూరు, గోపవరం వరకు ఉన్న రహదారిపై అడుగడుగునా గుంతలతో ప్రయాణికులు, ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఈ రహదారిలో నిత్యం రద్దీ

ఈ మార్గంలో నిత్యం అనేక వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారి మొత్తం గుంతలమయంగా మారడంతో తమ వాహనాలు దెబ్బతింటున్నాయని ప్రజలు వాపోతున్నారు. గుంతలను పూడ్చాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో మూడు నెలల కిందట ఆందోళనను నిర్వహించారు. ఈ మార్గంలో భారీ గుంతలు ఏర్పడటంతో వాటిని తప్పించే క్రమంలో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. వర్షాలు కురిసినప్పుడు ఈ గుంతల్లోకి వర్షం నీరు చేరి ఎంత లోతు ఉందో తెలియక ప్రయాణం నరకంగా మారుతోంది. పలువురు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు. నూజివీడులోని ఊటవాగు నుంచి పోతురెడ్డిపల్లి, సింహాద్రిపురం, ముసునూరు, గోపవరం వరకు రహదారి అధ్వానంగా మారింది. ఆర్అండ్‌బీ అధికారులు కనీసం తాత్కాలిక మరమ్మతులు కూడా చేయకపోవడమేమిటని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గమైనప్పటికీ ఉపయోగం ఏముందని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొన్ని చోట్ల కంకర కూడా రోడ్లపైకి లేచి ఉండి వాహనాల టైర్ల కింద పడి పక్కకు బుల్లెట్లలా దూసుకువస్తుండటంతో అవి ఎక్కడ తగులుతాయోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. త్వరితగతిన గుంతలు పూడ్చించాలని కోరుతున్నారు.

తక్షణం మరమ్మతులు చేయాలి



నూజివీడు-ముసునూరు రహదారికి తక్షణమే మరమ్మతులు చేయాలి. అడుగడుగునా గుంతలు ఉండటంతో ఆ మార్గంలో ప్రయాణించాలంటే వాహనాలు గుల్లవుతున్నాయి. అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడిచినా ఇంతవరకు గుంతలు పూడ్చకపోవడం దారుణం.

– చాట్ల పుల్లారావు, సీపీఐ నాయకుడు, నూజివీడు

వాహనాలు పాడవుతున్నాయి



ముసునూరు రోడ్డు అధ్వానంగా ఉంది. ఎక్కడ చూసినా గుంతలు ఉండటంతో ఈ మార్గంలో వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వాహనాలు పాడవుతున్నాయి. కుటుంబంతో కలిసి ఈ మార్గంలో ప్రయాణమంటే నరకాన్ని తలపిస్తోంది. వెంటనే రోడ్లు నిర్మించాలి.

– యర్రంశెట్టి రవితేజ, నూజివీడు

నేతాజీని స్ఫూర్తిగా తీసుకోవాలి

తిరువూరు: భారత స్వాతంత్య్రోద్యమంలో బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన ధీరోదాత్తుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్‌ను యువతరం ఆదర్శంగా తీసుకోవాలని లక్ష్మీపురం ఎంపీయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరికృష్ణ అన్నారు. పాఠశాలలో గురువారం నేతాజీ జయంతి కార్యక్రమం నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తిరువూరు బోస్ సెంటర్‌లోని నేతాజీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పల్లెపాటి శ్రీనివాసరావు, జి. కృష్ణమోహన్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాగార్జున స్కూల్‌లో నేతాజీ జయంతి సందర్భంగా ఆయన జీవిత విశేషాలను ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు విద్యార్థులకు వివరించారు.

- తిరువూరు: గంపలగూడెం మండలం పెనుగొలను ఎంపీయూపీ స్కూల్‌లో షిర్డీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు. నేతాజీ దేశభక్తిని, వీరోచిత పోరాటాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు లీలా శంకర్, రిటైర్డు ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి వివరించారు.
- మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమం జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ అజాద్ హింద్ ఫౌజ్ సంస్థను స్థాపించి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేశారని వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బి. శివహరి ప్రసాద్, ఎస్ .ఉమామహేశ్వరరెడ్డి, ఎన్‌సీసీ విద్యార్థులు కో-ఆర్డినేటర్ ఆర్. పవిత్ర తదితరులు పాల్గొన్నారు.
- నూజివీడు: నూజివీడు పట్టణంలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి బీజేపీ పట్టణ అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి పూలమాల వేసి నివాళులర్పించారు. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి

చాట్రాయి: స్వాతంత్య్ర సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని మండలంలోని తుమ్మగూడెం ఉర్దూ పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మర్లపాలెం హైస్కూల్ హెచ్ఎం గుంపా వెంకట్రావు మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ స్వాతంత్య్ర సమరంలో చేసిన త్యాగాలు మరువలేనివని విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పెనుగొలను ఎంపీయూపీ స్కూల్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థుల నివాళి



లక్ష్మీపురం ఎంపీయూపీ స్కూల్‌లో నివాళి



చంద్రబోస్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

ఎంపీపీ గోళ్ల అనూష

ఆగిరిపల్లి: సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని ఎంపీపీ గోళ్ల అనూష అన్నారు. గురువారం ఆగిరిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గోళ్ల అనూష అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సీతారాంపురం సర్పంచ్ అత్తి మురళి మాట్లాడుతూ మండలంలోని దివ్యాంగుల పింఛన్ల వెరిఫికేషన్ ఏలూరులో నిర్వహిస్తున్నారని, దీని వలన దివ్యాంగులు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. దివ్యాంగుల పింఛన్ల వెరిఫికేషన్ మండల కేంద్రమైన ఆగిరిపల్లిలో ఏర్పాటు చేయాలని తెలపగా ఏఓ అబ్దుల్ సలాం మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఎంపీటీసీ సాదం గోపి మాట్లాడుతూ జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు పూర్తైన లబ్ధిదారులకు రావాల్సిన బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారని ప్రశ్నించారు. ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ సుందర్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వం మంజూరు చేసిన గృహ నిర్మాణాల లబ్ధిదారులకు బిల్లులు చెల్లిస్తామన్నారు. ఏపీఎం రాజశేఖర్, ఎంఈఓ కొవ్వలి ఆనంద్ కుమార్ మాట్లాడారు. తహసీల్దార్ పీఎస్వీ ప్రసాద్, జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, వైస్ ఎంపీపీ కొండవరదల రమేష్, ఏఓ అబ్దుల్ సలాం, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందాలి

ఆగిరిపల్లి: ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులకు నైతిక విలువలు పెంపొందించాలని సమగ్ర శిక్ష ఏలూరు జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ కె.పంకజ్‌కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. తోటపల్లిలోని హీల్ ప్యారడైజ్ పాఠశాలలో ఈ నెల 20వ తేదీ నుంచి 25వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ అంశంపై సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఒకటి, రెండో తరగతి విద్యార్థులకు ఆట పాటలతో విద్య నేర్పించాలన్నారు. విద్యార్థుల ఆలోచనలో మార్పు తీసుకురావడం ద్వారా ప్రాథమిక స్థాయిలో నేర్చుకునే విషయాలు జీవిత కాలంలో జ్ఞాపకం ఉంచుకునేలా దోహదపడాలని చెప్పారు. రాష్ట్ర పరిశీలకుడు డి.శ్రీనివాస్, అకడమిక్ మానిటరింగ్ అధికారి రెడ్డి రామారావు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పంకజ్ కుమార్

వెల్వడంలో పశు వైద్య శిబిరం

మైలవరం: ఉచిత పశు వైద్య శిబిరాలను పశువుల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోమటి సుధాకరరావు అన్నారు. వెల్వడం గ్రామంలో పశు వైద్యశాల ఆధ్వర్యంలో పశు వైద్యశిబిరం గురువారం ప్రారంభించారు. పశువులకు పశు వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. నాయకులు, పాడి రైతులు పాల్గొన్నారు.

- తిరువూరు: ఆంజనేయపురంలో గురువారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారి స్వప్న పశువులకు వైద్య పరీక్షలు చేసి సీజనల్ వ్యాధులు రాకుండా టీకాలు వేశారు. గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. వెటర్నరీ అసిస్టెంట్స్ రాఘవరావు, రవి, సర్పంచి మామిడి కుటుంబరావు, పశు యజమానులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.5 లక్షలు వితరణ

మైలవరం: సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా మైలవరంలో నేరాలు నియంత్రించవచ్చని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. మైలవరం ఎల్‌హెచ్ షాపింగ్ కాంప్లెక్స్‌లో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీసీ కెమెరాలు కొనుగోలు చేసేందుకు పట్టణానికి చెందిన జయలక్ష్మి జ్యూవెలరీ మార్ట్ అధినేత బయన శ్రీనివాసరావు రూ. 5 లక్షల చెక్కును ఎమ్మెల్యే ద్వారా సీఐ దాడి చంద్రశేఖర్‌కు అందజేశారు. ఈ సొమ్ముతో పట్టణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. దాత బయన శ్రీనివాసరావును ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సత్కరించారు.

నష్టపరిహారం చెక్కులు అందజేత

మైలవరం: గత ఏడాది వరదలకు మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ సెల్లార్‌లోని దుకాణాలు ముంపునకు గురయ్యాయి. అప్పట్లో బాధితులకు నష్టపరిహారం అందజేసినా షాపింగ్ కాంప్లెక్స్‌లోని 50 మంది దుకాణదారులకు అందలేదు. వారికి ప్రభుత్వం రూ.12.75 లక్షలు మంజూరు చేసింది. దీనికి సంబంధించిన చెక్కులను బాధితులకు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ గురువారం అందజేశారు. బాధితులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మూగ జీవాల వ్యాధులపై అప్రమత్తం

ముసునూరు: మూగ జీవాల్లో సంభవించే వ్యాధులపై పశు పోషకులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ నూజివీడు ఉప సంచాలకుడు డాక్టర్ కె.చంద్రశేఖర్ అన్నారు. మండల పశు వైద్యాధికారి ఎం.వెంకట చైతన్య ఆధ్వర్యంలో గురువారం చెక్కపల్లి, యల్లాపురం గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. 85 గేదెలకు గర్భకోశ వ్యాధుల పరీక్షలు చేసి, 1,560 దూడలు, మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు, బొబ్బ వ్యాధి నిరోధక టీకాలు వేశారు. పశు వైద్య సహాయక సిబ్బంది, పశు పోషకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

నూజివీడు: పీఎం విశ్వకర్మ ద్వారా పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రధానాధికారి దేవరకొండ భూషణం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏళ్ల పైబడిన యువతీ యువకులకు బ్యూటీ వెల్‌నెస్ సెక్టార్‌లో అసిస్టెంట్ బార్బర్ సెలూన్ సర్వీసెస్ కోర్సులో శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 31వ తేదీలోగా సీఎస్‌సీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు సెల్: 83740 39719 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

ఇబ్రహీంపట్నం: ఫెర్రీ ఆర్టీసీ కాలనీలో తాళం వేసి ఉన్న ఇంట్లో గురువారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఇంటి యజమాని అరటికట్ల దుర్గాప్రసాద్ తన కుటుంబ సభ్యుల ఆపరేషన్ నిమిత్తం విజయవాడ వైద్యశాలకు వెళ్లాడు. పగటిపూట రెక్కీ నిర్వహించిన వ్యక్తులు రాత్రి వేళ ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాలో దాచి ఉంచిన 16 కాసుల బంగారం వస్తువులు, రూ.10 వేల నగదును దుండగులు చోరీ చేశారు. ఇంటికి అమర్చిన సీసీ కెమేరాల్లో నలుగురు దొంగలు ఇంట్లోకి ప్రవేశించినట్లు రికార్డు అయింది. క్లూస్ టీమ్ సభ్యులు వేలి ముద్రలు, ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ కెమేరా పుటేజీ ఆధారంగా విచారణ చేపట్టారు.

పీఎం సూర్య ఘర్‌పై అవగాహన ర్యాలీ

మూలపాడు(ఇబ్రహీంపట్నం): ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్తి బిజిలీ యోజనపై ప్రజలకు అవగాహన కల్పించాలని డ్వామా పీడీ రాము అన్నారు. వివిధ శాఖల సమన్వయంతో మూలపాడు గ్రామంలో గురువారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటుతో సొంతంగా విద్యుత్ ఉత్పత్తి చేసి విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చని వివరించారు. ప్రజలకు సోలార్ విద్యుత్‌పై అవగాహన కలిగించారు. తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ సునీతశర్మ, సర్పంచి చింతల భూలక్ష్మి, ఏపీఎం శోభన్‌బాబు, ఏపీఓ ప్రమీల, స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

- తిరువూరు: ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకంపై అవగాహన కల్పిస్తూ తిరువూరు నగర పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా సూర్య ఘర్ పథకం అమలు చేస్తున్నందున ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు లక్ష్మి, విద్యుత్ అధికారులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



తిరువూరు ర్యాలీలో పాల్గొన్న అధికారులు



మూలపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న వివిధ శాఖల అధికారులు

- మైలవరం: చంద్రాల గ్రామంలో సర్పంచ్ జె. జ్యోతి ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి సూర్య ఘర్ పథకం ప్రయోజనాలు తెలియజేస్తూ పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలో గురువారం సమావేశం నిర్వహించారు. పథకంపై అధికారులకు అవగాహన కల్పించారు. మాజీ ఎంపీపీ జొన్నలగడ్డ గంగాధరరావు, పంచాయతీ కార్యదర్శి దుర్గా ప్రసాదరావు, వార్డు సభ్యులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

సోలార్‌తో విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుంది

జి.కొండూరు: సోలార్ విద్యుత్ ద్వారా బిల్లుల భారం తగ్గుతుందని ఎంపీపీ వేములకొండ లక్ష్మీ తిరుపతమ్మ అన్నారు. జి.కొండూరులో ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజనపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఇంటిపై సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఎంపీడీఓ రామకృష్ణనాయక్, సర్పంచ్ మండల అరుణ, కార్యదర్శి బసవలింగేశ్వరరావు, విద్యుత్ శాఖ ఏఈ షఫీ, ఈఓపీఆర్‌డీ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్‌తో క్యాన్సర్ నివారణ

తిరువూరు: బాలికలు, మహిళల్లో వచ్చే గర్భాశయ క్యాన్సర్ నివారణకు వ్యాక్సినేషన్ ఎంతో ప్రయోజనకరమని ప్రముఖ గైనకాలజిస్టు తాళ్లూరి రామకోటేశ్వరరావు అన్నారు. తిరువూరు శ్రీనిధి స్కూల్‌లో విద్యార్థినులకు, ఉపాధ్యాయినులకు గర్భాశయ క్యాన్సర్‌పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. భారతదేశంలో క్యాన్సర్ కారణంగా ప్రతి 8 నిముషాలకు ఒక మహిళ చనిపోతున్నారని, 9 ఏళ్ల నుంచి 14 సంవత్సరాల లోపు ఆడపిల్లలు హెచ్‌పీవీ వ్యాక్సిన్ రెండు డోసులు తీసుకుంటే జీవితంలో క్యాన్సర్ దరిచేరదన్నారు. బాలికల్లో వచ్చే ఆరోగ్య సమస్యలను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గుర్తించి అవసరమైన వైద్యం అందించాలని సూచించారు. పాఠశాల కరస్పాండెంటు కిశోర్, ప్రధానోపాధ్యాయుడు వెంకట నారాయణ పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల తొలగింపు సరికాదు

ఇబ్రహీంపట్నం: ట్రాఫిక్ నియంత్రణ పేరుతో చిరు వ్యాపారులను రింగ్ సెంటర్ నుంచి తొలగించడం సరికాదని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పచ్చిగోళ్ల పండు అన్నారు. తోపుడు బండ్లను తొలగించిన పోలీసుల తీరును గురువారం ఒక ప్రకటనలో ఆయన ఖండించారు. కొన్నేళ్లుగా రింగ్ సెంటర్‌లో చిరు వ్యాపారాలు చేసుకుంటూ వారు కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చిరు వ్యాపారులకు చేదోడు పథకం ద్వారా రూ.10 వేలు ఇచ్చి ప్రోత్సహించిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం చిరు వ్యాపారుల పొట్టకొట్టడం దారుణమన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

చాట్రాయి: సారా తయారీ కేంద్రాలపై దాడి చేశామని నూజివీడు ఎక్సైజ్ ఎస్ఐ మస్తానరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని మంకొల్లు గ్రామంలో సారా తయారు చేస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేసి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఆయన చెప్పారు. సారా రవాణా చేస్తున్న ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని పారిపోయిన నిందితుడు తాళం రాముపై కేసు నమోదు చేశామన్నారు. పోతనపల్లి చిన తండాలో నిర్వహించిన దాడుల్లో వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామని, అక్కడి నుంచి పరారైన తయారీదారుడు వడిత్యాపై కేసు నమోదు చేశామని చెప్పారు.

చంద్రాల ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్ వితరణ

మైలవరం: మైలవరం మండలం చంద్రాల గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు ఐడీబీఐ బ్యాంక్ చంద్రాల శాఖ రూ.60 వేల విలువైన కంప్యూటర్‌ను గురువారం బహూకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వరదా శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు బ్యాంక్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఐడీబీఐ నూజివీడు బ్రాంచ్ మేనేజర్ ఎం. ప్రదీప్ విజయ్, చంద్రాల బ్రాంచ్ మేనేజర్ బంగారుబాబు, అసిస్టెంట్ మేనేజర్ డి. సుధాకర్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు సవాళ్లను అధిగమించాలి

గానుగపాడు(తిరువూరు): విద్యార్థులు ఎన్ని సవాళ్లు ఎదురైనా చదువు మానవద్దని, నిర్దేశిత లక్ష్యంతోనే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని పర్వతారోహకురాలు డాక్టర్ ఎం. నవ్య అన్నారు. గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థినులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యతోనే అన్ని సమస్యలూ పరిష్కారమవుతాయన్నారు. ఆర్థిక, సామాజిక, కుటుంబ సమస్యలను ఎదుర్కొని ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. ప్రధానోపాధ్యాయిని ఆదిలక్ష్మి, జేవీవీ ప్రతినిధులు రాంప్రదీప్, సుదర్శన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్వతారోహకురాలు నవ్యను ఉపాధ్యాయులు సత్కరించారు.



నవ్యను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

జీడి మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలి

నూజివీడు: జీడి పప్పు పండించడంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ద్వితీయ స్థానంలో ఉందని, ఈ నేపథ్యంలో జీడి మామిడికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి దినవహి హరినాథ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎనిమిది జిల్లాల్లో 1.83 లక్షల ఎకరాల్లో జీడి పంట పండిస్తున్నారని, పలాస జీడిపప్పు అత్యంత గుర్తింపు పొందిందని చెప్పారు. వ్యాపారులు, దళారులు రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా దోపిడీ చేస్తున్నారని, విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న జీడి పప్పు ద్వారా స్వదేశీ జీడి రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 80 కేజీల బస్తాకు కనీస మద్దతు ధర రూ.16 వేలు ప్రకటించాలని, జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేసి, జీడి పంటకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కింద బ్యాంకు రుణాలు అందజేయాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారా జీడీ పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

రేపు జాబ్‌మేళా

నూజివీడు: పట్టణంలోని ఎంవీఆర్ జూనియర్ కళాశాలలో ఈ నెల 25న జాబ్‌మేళా నిర్వహిస్తామని ఏలూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.జితేంద్రబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు కలిగిన పది, ఇంటర్, డిగ్రీ, ఆపై విద్యార్హత కలిగిన యువతీ యువకులు తమ విద్యార్హతకు సంబంధించిన ధ్రువీపత్రాలతో ఉదయం తొమ్మిది గంటలకు కళాశాలలో నిర్వహించే జాబ్ మేళాకు హాజరు కావచ్చన్నారు.